అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people

## క్రీడ రంగంలో ములుగు జిల్లా సత్తా

- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న ములుగు క్రీడాకారులు
- అథ్లెటిక్స్ స్టేడియం నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు
- ఒలింపిక్ డే రన్ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క

03



గురువారం, 25, జూన్ 2026 | సంపుటి : 03 | సంచిక : 133 | పేజీలు : 05 | వెల ₹5



## నిర్లక్ష్యం వద్దు

- ప్రతీ అర్హత కలిగిన ఓటును కాపాడాలి
- ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించాలి
- పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

04

**అక్షరదర్బార్, భూపాలపల్లి :**

జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీవో) వెంకన్న ఘోర రోడ్డు ప్రమాదం మృతి కేసు విచారణ వేగవంతమైంది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక విచారణాధికారి, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్ బుధవారం భూపాలపల్లిలో సుదీర్ఘంగా దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలంలో 'సీన్ రీ-కన్‌స్ట్రక్షన్' (సన్నివేశ పునర్నిర్మాణం) చేయించడంతో పాటు, ప్రమాదానికి కారణమైన లారీ లోడింగ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. క్షేత్రస్థాయి పరిశీలన ముగిసిందని, ఒకట్రెండు రోజుల్లో రవాణా కమిషనర్‌కు పూర్తి నివేదిక సమర్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.



# సీన్ రీ కన్ స్ట్రక్షన్

### డీటీవో వెంకన్న మృతి కేసుపై రంగంలోకి జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్

- క్షేత్రస్థాయిలో లారీ, హార్వెస్టర్ డ్రైవర్ల విచారణ
- పోలీసులు, జెన్‌కో, తాడిచర్ల ఓపెన్ కాస్ట్ అధికారులతో సమీక్ష
- త్వరలో కమిషనర్‌కు నివేదిక.. చంద్రశేఖర్ గౌడ్

03

# సంపులో పడి చిన్నారి మృతి

- తట్టుకోలేక గుండెపోటుతో నానమ్మ కన్నుమూత
- ఒకే ఇంట్లో కొన్ని గంటల వ్యవధిలోనే ఇద్దరి మరణం
- కన్నీరు మున్నీరవుతున్న కుటుంబ సభ్యులు
- జనగామలో విషాదం

అక్షరదర్బార్, జనగామ: జనగామ జిల్లా కేంద్రంలో బుధవారం ఒకే కుటుంబంలో కొన్ని గంటల వ్యవధిలోనే రెండు తీవ్ర విషాదాలు చోటుచేసుకున్నాయి. ప్రమాదవశాత్తూ నీటి సంపులో పడి ఏడాదిన్నర (రెండేళ్ల) చిన్నారి మరణించగా, ఆ ఘోరాన్ని తట్టుకోలేక ఆమె నానమ్మ గుండెపోటుతో అక్కడికక్కడే కన్నుమూసింది. ఈ హృదయవిదారక సంఘటన స్థానిక అంబేద్కర్ నగర్‌లో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన చేర్యాల శేఖర్, లావణ్య దంపతులకు ఏడాదిన్నర కుమార్తె రియాన్సీ ఉంది. బుధవారం ఉదయం చిన్నారి రియాన్సీ ఇంటి ముందు ఆడుకుంటూ అందరి కళ్లు గప్పి ప్రమాదవశాత్తూ తెరిచి ఉన్న నీటి సంపు (అండర్‌గ్రౌండ్ వాటర్ ట్యాంక్) లో పడిపోయింది. కాసేపటికి పాప కనిపించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల అంతా వెతికారు. చివరకు సంపులో చూడగా చిన్నారి నీటిలో మునిగి అపస్మారక స్థితిలో కనిపించింది. వెంటనే ఆమెను బయటకు తీసి ఆసుపత్రికి తరలించేలోపే పాప ఊపిరి వదిలేసింది.

**మనవరాలి మరణం చూసి ఆగిన నానమ్మ గుండె..**

కంటిపాపలా చూసుకుంటున్న మనవరాలు రియాన్సీ కళ్లముందే శవమై కనిపించడంతో నానమ్మ మారబోయిన నాగమ్మ (66) తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. కడుపుకోతతో, విపరీతమైన ఆవేదనతో ఏడుస్తూ ఆమె అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. తీవ్రమైన గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ, అప్పటికే ఆమె ప్రాణాలు విడిచినట్లు వైద్యులు నిర్ధారించారు.

**కన్నీరుమున్నీరవుతున్న కాలనీ**

ఆడుతూ పాడుతూ తిరగాల్సిన చిన్నారి, ఆమెను ప్రాణంగా చూసుకునే నానమ్మ ఇద్దరూ ఒకేసారి అనంత లోకాలకు వెళ్లిపోవడంతో ఆ ఇల్లాంతా కన్నీరుమున్నీరవుతోంది. ఒకే ఇంట్లో కొన్ని గంటల వ్యవధిలోనే రెండు శవాలను చూసి బంధువులు, కాలనీవాసులు తట్టుకోలేకపోతున్నారు. ఈ ఘోర ప్రమాదం సమాచారం అందుకున్న జనగామ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## డబుల్ ఓటు ఉంటే.. జైలు శిక్ష

- నేటినుంచి జూలై 24 వరకు ఇంటింటి ఎన్యుమరేషన్
- సందేహాల నివృత్తికి 1800 425 1126 టోల్ ఫ్రీ నంబర్
- ఓటర్ల జాబితా పారదర్శకతకు అందరూ సహకరించాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి
- ఎస్ఐఆర్-2026పై మీడియా ప్రతినిధులతో అవగాహన సమావేశం

03



## పర్యావరణ పరిరక్షణతోనే

# సంపూర్ణ ఆరోగ్యం

- సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడబోమంటూ గ్రామ పంచాయతీ ప్రతిజ్ఞ
- తిమ్మంపేటలో ఏఎస్సార్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సదస్సు
- సర్పంచ్ మోడెమ్ శ్రీలతమల్లేశం పిలుపు

దుగ్గొండి, జూన్ 24 (అక్షరదర్బార్): పర్యావరణ పరిరక్షణ సంపూర్ణ ఆరోగ్యంకు భరోసా అని తిమ్మంపేట సర్పంచ్ మోడెమ్ శ్రీలతమల్లేశం గ్రామస్తులకు సూచించారు. బుధవారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ కొరకు తిమ్మంపేట గ్రామపంచాయతీ ఆవరణలో ఏఎస్సార్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి తిమ్మంపేట గ్రామ సర్పంచ్ మోడెం శ్రీలతమల్లేశం హాజరై మాట్లాడారు. గ్రామ ప్రజల ఆరోగ్య రక్షణ కొరకు, హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ కొరకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం కలిసి ప్లాస్టిక్ రహిత ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి, పర్యావరణ పరిరక్షణ కొరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడబోమంటూ తీర్మానం చేసి ప్రతిజ్ఞ చేశారు. కన్స్యూమర్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు రతన్ సింగ్, జిల్లా అధ్యక్షులు సుదర్శన్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వాడకంతో అనారోగ్య సమస్యలతో పాటు క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉన్నదని, ప్లాస్టిక్ వస్తువులను వాడకుండా ఆరోగ్యాన్ని రక్షించుకోవాలన్నారు. స్వచ్ఛంద సంస్థల బాధ్యులు ఎర్రబోయిన రాజశేఖర్, శ్రీనివాస్ రావు, బెజ్జంకి ప్రభాకర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయంగా స్టీల్, విస్తరాకు, పింగాణి, మట్టి పాత్రలను మరియు భూమిలో కలిసిపోయే బయోడిగ్రేడబుల్ కవర్లను వాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్స్ కూనూరు సతీష్, కుమార్, భాష బోయిన, సురేష్, రడం రాజేందర్, దండు గౌతమి, దొనపాటి మానస, గ్రామపెద్దలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## 'యోగి వేమన ధ్రువ వాస్తు'

# పుస్తకం ఆవిష్కరణ

- పుస్తకాన్ని ఆవిష్కరించిన ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్
- భావితరాలకు ఎంతో ఉపయోగపడుతుందన్న రచయిత కొత్తపల్లి మొగిలి

అక్షరదర్బార్, ములుగు: ప్రముఖ వాస్తు పండితుడు కొత్తపల్లి శాలివాహన రచించిన యోగివేమన ధ్రువ వాస్తు పుస్తకమును జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో రైస్ మిల్లర్ల అసోసియేషన్ కార్యవర్గంతో కలిసి జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్ ఆవిష్కరించారు. వాస్తు పుస్తకమును రచించిన కొత్తపల్లి మొగిలి (కొత్తపల్లి శాలివాహన) మాట్లాడుతూ భావితరాలకు ఈ యోగివేమన ధ్రువవాస్తు పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి సహోదరి రెడ్డి, కోశాధికారి ఎలగందుల మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురవెల్లి హరినాథ్, ఉపాధ్యక్షులు అక్కల రగోతం, సహాయ కార్యదర్శి దేగల భద్రయ్య, బి.ఎన్.రెడ్డి, వల్లాల అనిల్ పాల్గొన్నారు.



# నడికూడలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

- పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డిపై వ్యాఖ్యలు మానుకోవాలి
- రాజకీయ విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మేడిపల్లి శోభన్‌కుమార్ డిమాండ్



అక్షరదర్బార్, నడికూడ: ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా నడికూడ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మేడిపల్లి శోభన్‌కుమార్ మాట్లాడుతూ మహిళల స్వయం ఉపాధి కోసం పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ, పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. రాజకీయ విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యేకు సూచించారు. మాజీ వైస్ ఎంపీపీ చందా కుమారస్వామి మాట్లాడుతూ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిపై వస్తున్న ప్రజాదరణను చూసి కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. మాజీ మండల ప్రధాన కార్యదర్శి నందికొండ గణపతిరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో కమిషన్లకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యేపై విమర్శలు గుప్పించారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రేవూరి ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారు

- పరకాల నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?
- బీఆర్ఎస్ నాయకులు సాంబారి సమ్మరావు, బండి సారంగపాణి సవాల్

అక్షరదర్బార్, పరకాల: ఎన్నికల అనంతరం అన్ని పార్టీల నాయకులు సఖ్యతతో ఉన్న పరకాలలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అనవసర వివాదాలకు తెరలేపి ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు సాంబారి సమ్మరావు, బండి సారంగపాణి ఆరోపించారు. బుధవారం పరకాల పట్టణంలోని ఎఫ్‌జె గార్డెన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మహిళల స్వయం ఉపాధి కోసం ఎన్నో ఏళ్లుగా ఉచిత కుట్టుమిషన్ శిక్షణ, కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అలాంటి వ్యక్తిపై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని ఎమ్మెల్యేకు సూచించారు. కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాలను పరిశీలించిన సందర్భాల్లో ఎమ్మెల్సీ ఎక్కడా కాంగ్రెస్ పార్టీని గానీ, ఎమ్మెల్యేను గానీ విమర్శించలేదని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హయాంలోనే పరకాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, ప్రస్తుత ఎమ్మెల్యే రెండున్నరేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. పరకాల అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. పార్టీ నాయకులపై అనవసర ఆరోపణలు చేస్తే బీఆర్ఎస్ కార్యకర్తలు తగిన విధంగా స్పందిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గురుజపల్లి ప్రకాష్ రావు, చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, చందుపట్ల సాయి తిరుపతి రెడ్డి, దుంపటి నాగరాజు, కొక్కిరాల రాకేష్ రావు, గుండేటి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



# గడ్డంవాడ కాలనీలో 13 ఏళ్ల సమస్యకు పరిష్కారం

- డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు పూర్తి కావడంతో కాలనీవాసుల హర్షం
- నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి కృతజ్ఞతలు

అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ 3వ వార్డు గడ్డంవాడ కాలనీలో దీర్ఘకాలంగా నెలకొన్న రహదారి, డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం లభించింది. గత 13 ఏళ్లుగా డ్రైనేజీ నీటి పారుదల సక్రమంగా లేకపోవడం, సీసీ రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, తాజాగా సైడ్ డ్రైనేజీతో పాటు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. పనులు పూర్తికావడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, సమన్వయ కమిటీ సభ్యుడు పొరండ్ల సంతోష్ మాట్లాడుతూ గతంలో పలుమార్లు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని, ప్రస్తుతం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చొరవతో నిధులు మంజూరై పనులు పూర్తయ్యాయని తెలిపారు. టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం శివకుమార్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్‌కుమార్‌లకు ధన్యవాదాలు తెలిపారు. వార్డులో మౌలిక సదుపాయాల కల్పనలో కౌన్సిలర్ పొరండ్ల మౌనిక వేణు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ సూర్నేని స్వామి రావు, ఓంకారం శ్రీధర్‌రాజు, రావుల అశోక్, గడ్డం రాజు, గడ్డం దేవేందర్, బాసాని సుమన్, శ్రీరాముల రాజేష్, గడ్డం అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# మత్తుకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

- వ్యసనం నుంచి బయటపడాలనుకునే వారికి పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత వైద్యం
- గంజాయి విక్రేతల సమాచారం ఇస్తే నగదు బహుమతి
- కొయ్యూరు ఎస్సై మహేందర్ కుమార్ పిలుపు




అక్షరదర్బార్, మల్హర్: మండలంలోని యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కొయ్యూరు ఎస్సై మహేందర్ కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు బుధవారం కొయ్యూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో మత్తు పదార్థాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు రూపొందించిన గోడపత్రికలను (పోస్టర్లను) గ్రామాల్లో అందరికీ కనిపించేలా అంటించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, ఎవరైనా పొరపాటున మత్తు పదార్థాలకు అలవాటు పడి, ఆ వ్యసనం నుండి బయటపడలేకపోతుంటే ధైర్యంగా పోలీసులను సంప్రదించవచ్చని, వారికి పోలీసుల ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య సహాయం అందించి సాధారణ జీవితం గడిపేలా సహకరిస్తామని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచడంతో పాటు వారికి తగిన నగదు బహుమతిని ప్రోత్సాహకంగా అందిస్తామని పేర్కొన్నారు. యువత జీవితాలను పాడు చేస్తూ, మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడే అసాంఘిక శక్తులపై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాలను మత్తు రహితంగా మార్చేందుకు యువత, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పోలీసులకు సహకరించాలని కోరారు.



# క్రీడా రంగంలో ములుగు జిల్లా సత్తా

**జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న ములుగు క్రీడాకారులు**

**అథ్లెటిక్స్ స్టేడియం నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు**

**ఒలింపిక్ డే రన్ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క**

అక్షరదర్బార్, ములుగు: క్రీడా రంగంలో ములుగు జిల్లా సత్తాను చాటుతుందని, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ములుగు క్రీడాకారులు రాణిస్తున్నారని, క్రీడాకారుల ప్రోత్సాహానికి ప్రజా ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. జిల్లాలో క్రీడాకారుల కోసం అథ్లెటిక్స్ స్టేడియం నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేయడం జరిగిందని వెల్లడించారు. బుధవారం ములుగు ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ, భారత ఒలింపిక్ సంఘం, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్ 2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్‌తో కలిసి క్రీడా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లా మారుమూల ప్రాంతం అయినప్పటికీ క్రీడా రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తూ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో గుర్తింపు పొందుతోందన్నారు. పేదరికం, వెనుకబడిన పరిస్థితులు ఉన్నప్పటికీ జిల్లాలోని పిల్లల్లో ఉన్న ప్రతిభ అపారమని, వాలీబాల్, ఆర్చరీ వంటి క్రీడల్లో ములుగు జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి పతకాలు సాధించిన చరిత్ర ఉందన్నారు. క్రికెట్ సహా ఇతర క్రీడల్లో కూడా విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అథ్లెటిక్స్ స్టేడియం ఏర్పాటు కోసం వచ్చిన ప్రతిపాదన మేరకు రూ.4 కోట్ల నిధులను వెంటనే మంజూరు చేయించామని, భవిష్యత్తులో అవసరమైన అదనపు సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి తాను ఎంచుకున్న క్రీడలో విజయం సాధించి ములుగు జిల్లా ఖ్యాతిని మరింత పెంచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, డీఈవో సిద్ధార్థ రెడ్డి, డి.ఎస్.పి రవీందర్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పగడాల వెంకటేశ్వర రెడ్డి, పీడీలు, పి ఈ టి లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన చందుపట్ల కీర్తిరెడ్డి

- శాయంపేటలో తనుశ్రీ – రేవంత్ కుమార్ల వివాహ వేడుక
- హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిదర్ రెడ్డి

అక్షరదర్బార్, శాయంపేట: శాయంపేట మండల కేంద్రంలోని ఎస్వి కేకే ఫంక్షన్ హాల్‌లో జరిగిన తనుశ్రీ – రేవంత్ కుమార్ వివాహ మహోత్సవానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తిరెడ్డి, జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిదర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రాయరాకుల మొగిలి, పార్లమెంట్ కో-కన్వీనర్ లింగంపల్లి ప్రసాదరావు, జిల్లా నాయకులు కానుగుల నాగరాజు, వనము దేవరాజు, బాసని విద్యాసాగర్, కోమటి రాజశేఖర్, కదారి చంద్రమౌళి, సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# డబుల్ ఓటు ఉంటే.. జైలు శిక్ష

- నేటినుంచి జూలై 24 వరకు ఇంటింటి ఎన్యుమరేషన్
- సందేహాల నివృత్తికి 1800 425 1126 టోల్ ఫ్రీ నంబర్
- ఓటర్ల జాబితా పారదర్శకతకు అందరూ సహకరించాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి
- ఎస్ఐఆర్-2026పై మీడియా ప్రతినిధులతో అవగాహన సమావేశం



అక్షరదర్బార్, హనుమకొండ: ఓటరు జాబితాను మరింత ప్రామాణికంగా, పారదర్శకంగా రూపొందించే లక్ష్యంతో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమానికి ప్రజలతో పాటు మీడియా ప్రతినిధులు కూడా పూర్తి స్థాయిలో సహకరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి కోరారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె ఎస్ఐఆర్-2026 అమలు విధానం, ఎన్యుమరేషన్ ప్రక్రియ, ఓటర్ల బాధ్యతలపై సమగ్ర వివరణ అందించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ భాస్కర్ రెడ్డి ప్రత్యేక ప్రజెంటేషన్ ద్వారా ఎన్యుమరేషన్ ఫారమ్‌ను పూరించే విధానాన్ని వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు సరైన సమాచారం చేరవేసే విషయంలో మీడియా కీలక పాత్ర పోషించాలన్నారు. ఎస్ఐఆర్‌పై ఉన్న అపోహలు, అనుమానాలను తొలగించి అవగాహన పెంపొందించడంలో మీడియా సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఓటరూ ఈ ప్రక్రియలో భాగస్వామి అయ్యేలా విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. జిల్లాలోని వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల్లో నిర్వహించిన ముందస్తు ఎస్ఐఆర్ ప్రక్రియ సానుకూల ఫలితాలను ఇచ్చిందని కలెక్టర్ తెలిపారు. వరంగల్ పశ్చిమలో 68 శాతం, పరకాలలో 87 శాతం మేర మ్యాపింగ్ ఇప్పటికే పూర్తయిందని ఆమె వెల్లడించారు.

### నేటి నుంచే ఇంటింటి ఎన్యుమరేషన్..

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2026లో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు హౌస్-టు-హౌస్ ఎన్యుమరేషన్ ప్రక్రియ నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఓటర్ కి ఎన్యుమరేషన్ ఫారమ్ అందజేయాలని, ఒకవేళ ఇంట్లో ఓటర్లు లేకపోతే కనీసం మూడు సార్లు వారి నివాసాన్ని సందర్శించాలని సిబ్బందిని ఆదేశించారు. 2002 ఓటరు జాబితాలో ఉన్న అర్హులైన ఓటర్లకు ఈ దశలో ఎటువంటి సహాయక పత్రాలు అవసరం లేదని, వివరాలు ధృవీకరించి సంతకం తీసుకుంటే సరిపోతుందని స్పష్టం చేశారు. జూలై 31న ప్రచురించే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఫారమ్‌లు సమర్పించిన వారి పేర్లు మాత్రమే ఉండే అవకాశం ఉన్నందున, ఫారమ్‌ల పంపిణీ, సేకరణను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు.

### కొత్త ఓటర్ల నమోదు.. బదిలీలు..

అర్బన్ ప్రాంతాల్లో షిఫ్టెడ్ ఓటర్లు, అద్దె నివాసితులు, కొత్తగా వచ్చిన వారి వివరాలను నమోదు చేసి, అవసరమైతే ఫారమ్-8 ద్వారా బదిలీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులందరికీ ఫారమ్-6 అందించి కొత్త ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. అలాగే, మరణించిన లేదా నివాసం మార్చిన ఓటర్ల వివరాలను తగిన ఆధారాలతో నమోదు చేయాలని, ఎలాంటి ఆధారాలు లేకుండా ఏ ఒక్కరి పేరును కూడా జాబితా నుండి తొలగించరాదని స్పష్టం చేశారు.

### డబుల్ ఓటు ఉంటే ఏడాది జైలు

మరణించిన వ్యక్తుల పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారి పేర్లు, బహుళ ప్రాంతాల్లో నమోదైన ఓట్లను గుర్తించి నిబంధనల ప్రకారం సవరిస్తామని కలెక్టర్ చెప్పారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు నమోదు అయి ఉండటం లేదా తప్పుడు వివరాలు సమర్పించడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. ఈసీఐ సెక్షన్ 31 ప్రకారం రెండుచోట్ల ఓటు హక్కు కలిగి ఉండటం నేరమని, దీనికి సదరు వ్యక్తులపై చట్ట ప్రకారం సంవత్సరం జైలు శిక్షతో పాటు జరిమానా విధించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

### ప్రత్యేక సహాయ కేంద్రాలు.. టోల్ ఫ్రీ నంబర్..

ఎస్ఐఆర్‌కు సంబంధించిన సందేహాల నివృత్తి కోసం జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే ప్రజల కోసం 1800 425 1126 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. సేకరించిన వివరాలను అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిశీలన చేపడతామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించడమే ఎస్ఐఆర్ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్-2026ను విజయవంతం చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్ రవి, డీఆర్ఓ కె శ్రీనివాస్, డీపీఆర్ఓ అయూబ్ అలీ, ఆర్డీవో వెంకటేష్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఇతర సంబంధిత అధికారులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# సీన్ రీ కన్ స్ట్రక్షన్

- క్షేత్రస్థాయిలో లారీ, హార్వెస్టర్ డ్రైవర్ల విచారణ
- పోలీసులు, జెన్‌కో, తాడిచర్ల ఓపెన్ కాస్ట్ అధికారులతో సమీక్ష
- త్వరలో కమిషనర్‌కు నివేదిక.. చంద్రశేఖర్ గౌడ్

**డీటీవో వెంకన్న మృతి కేసుపై రంగంలోకి జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్**



అక్షరదర్బార్, భూపాలపల్లి : ఈ నెల 22న భూపాలపల్లి ఆర్టీవో ఆఫీస్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీవో) వెంకన్న మరణించిన సంగతి తెలిసిందే. ఈ విషాద ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విచారణ అధికారి, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్ బుధవారం భూపాలపల్లిలో విచారణ చేపట్టారు. సమగ్ర దర్యాప్తులో భాగంగా ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి పలువురిని విచారించారు. విచారణ సాగిందిలా..

### పోలీస్ స్టేషన్‌లో ప్రాథమిక సమీక్ష

విచారణాధికారి చంద్రశేఖర్ గౌడ్ తొలుత గణపురం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ప్రమాదంపై పోలీసులు జరిపిన ప్రాథమిక దర్యాప్తు వివరాలను స్టేషన్ సీఐ కరుణాకర్ రావు, ఎస్ఐ అశోక్‌లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్, లారీ యజమానితో పాటు హార్వెస్టర్ డ్రైవర్‌ను కూడా ఆయన సుదీర్ఘంగా విచారించారు.

### జెన్‌కో, తాడిచర్ల ఓపెన్ కాస్ట్‌లలో రికార్డుల పరిశీలన

ప్రమాద తీవ్రతకు గల కారణాలను అన్వేషించే క్రమంలో.. జెన్‌కో అధికారులతో సమావేశమై ప్రమాదానికి గురైన లారీలోని బొగ్గు వివరాలను సేకరించారు. ఆ తర్వాత బొగ్గు లోడింగ్ పాయింట్ అయిన తాడిచర్ల ఓపెన్ కాస్ట్‌కు వెళ్లిన విచారణాధికారి, అక్కడి ప్రతినిధులతో మాట్లాడి ప్రమాదం జరిగిన రోజున ఆ లారీకి సంబంధించిన లోడ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. లోడింగ్ పరిమితికి మించి ఉందా అనే కోణంలో తనిఖీలు చేశారు.

### ఘటనా స్థలంలో సీన్ రీ-కన్‌స్ట్రక్షన్..

అనంతరం ఆర్టీవో ఆఫీస్ సమీపంలోని ప్రమాద స్థలానికి చేరుకున్న జాయింట్ కమిషనర్.. ప్రమాదం జరిగిన తీరును అర్థం చేసుకోవడానికి 'సీన్ రీ-కన్‌స్ట్రక్షన్' (సన్నివేశ పునర్నిర్మాణం) చేయించి పరిస్థితులను విశ్లేషించారు. ఘటనను కళ్లారా చూసిన నలుగురు ప్రత్యక్ష సాక్షులను విచారించి వారి స్టేట్‌మెంట్లను రికార్డ్ చేశారు. అలాగే ప్రమాద స్థలానికి సమీపంలో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను సైతం నిశితంగా పరిశీలించారు.

### త్వరలోనే రవాణా కమిషనర్‌కు నివేదిక

ఈ విచారణకు సంబంధించిన ప్రాథమిక నివేదికను ఒకటి రెండు రోజుల్లో రాష్ట్ర రవాణా కమిషనర్‌కు సమర్పించనున్నట్లు విచారణాధికారి చంద్రశేఖర్ గౌడ్ వెల్లడించారు. ఈ విచారణలో జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్ వెంట మోటారు వాహన తనిఖీ అధికారులు జంగ్గీ శ్రీనివాస్, శివపల్లి శ్రీనివాస్, బారగాడి శ్రీనివాస్, గణపురం సీఐ కరుణాకర్ రావు, ఎస్ఐ అశోక్, భూపాలపల్లి ఏఎంవీఐలు ఫాహిమా సుల్తానా, సుందర్ లాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం వద్దు

- ప్రతీ అర్హత కలిగిన ఓటును కాపాడాలి
- ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించాలి
- పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

అక్షరదర్బార్, హైదరాబాద్ : రాష్ట్రంలో గురువారం ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా పేదలు, బడుగు బలహీన వర్గాలు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. బుధవారం జరిగిన జూమ్ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ లు, బీఎల్ఓలు, సర్పంచ్‌లు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించడంతో పాటు ప్రతి అర్హత గల ఓటును కాపాడటమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

**పార్టీకి నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకోం**

రాష్ట్రంలో రేపటి నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ఈ ప్రక్రియను సీరియస్‌గా పరిగణిస్తోంది. ఇవాళ ఉదయం జరిగిన జూమ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ లు పాల్గొన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ బాధ్యులు మరింత అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎస్ఐఆర్ విషయంలో కొందరు నాయకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీకి నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. జిల్లాల వారీగా నిర్వహించిన అవగాహన సదస్సులకు చెందిన పూర్తి వివరాలు తన వద్ద ఉన్నాయని, ఎవరెవరు నిర్లక్ష్యం చేస్తున్నారో పేర్లతో సహా వెల్లడించగలనని, కానీ ఆ పరిస్థితులు తెచ్చుకోవద్దని హెచ్చరించారు.

**ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించండి**

ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ పార్టీ తరఫున రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సీఎం సూచించారు. ఇన్‌ఛార్జ్ మంత్రులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించిన రేవంత్ రెడ్డి, ఎస్ఐఆర్ ప్రక్రియలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే పేద ప్రజలకు అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు. పేదల ఓట్లు జాబితా నుంచి తొలగిపోతే వారి హక్కులు దెబ్బతింటాయని, అలాంటి పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందన్నారు.





## వన మహోత్సవంలో మొక్కలు నాటాలి

**హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి**

అక్షరదర్బార్, హనుమకొండ: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో వివిధ రకాల మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు ఎంపీఓలతో వన మహోత్సవం, ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి హామీ పనులు, తదితర అంశాలపై సమావేశాన్ని నిర్వహించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి, ఉపాధి హామీ పనులు, టాయిలెట్ల నిర్మాణం, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో శేషాద్రి, డీఆర్డీఓ మేన శ్రీను, డీపీఓ లక్ష్మి రమాకాంత్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈఈ సైదుల్ రెడ్డి, అడిషనల్ డీఆర్ డీఓ లక్ష్మి ప్రసన్న, ఇతర అధికారులతో పాటు ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాల కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలి

- ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు నమోదు పారదర్శకంగా ఉండాలి
- విద్యార్థులు ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించేలా బోధించాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్
- విద్యాశాఖ అధికారులతో సమీక్ష



అక్షర దర్బార్, మహబూబాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించుటకై ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో బడిబాట కార్యక్రమం, ఉపాధ్యాయుల, విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు (ఎఫ్ఆర్ఎస్) పై జిల్లా, మండలాల విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు, బడిబయట పిల్లల గుర్తింపు, నమోదు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. జూన్ 6 నుండి 19 వరకు జరిగిన బడిబాట కార్యక్రమంలో విద్యార్థులను ప్రభుత్వ బడులలో చేర్పించేందుకు తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. బడిబాట లక్ష్యాన్ని ఛేదించేందుకు, ప్రవేశాలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో విద్యార్థులు లేక మూతపడిన పాఠశాలల్లోని ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి, విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలలకు పంపించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంలో ఉపాధ్యాయుల సమయపాలన కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (FRS) ద్వారా రోజువారీ హాజరు నమోదును పారదర్శకంగా, జవాబుదారీగా నిర్వహించాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, కేజీబీవీలలో సిబ్బంది రోజూ ఎఫ్ఆర్ఎస్ ద్వారా ఇన్/అవుట్ హాజరు నమోదు చేయాలన్నారు. కెమెరా, నెట్‌వర్క్, యాప్ సమస్యలు ఉంటే వెంటనే ఎంఈఓ, డీఈఓల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. తక్కువ హాజరు శాతం ఉన్న పాఠశాలలు, సిబ్బందిపై డీఈఓ స్థాయిలో సమీక్ష చేసి కారణాలు తెలుసుకోవాలన్నారు. పాఠశాలల్లో వంట కోసం ఎల్‌పీజీ కనెక్షన్లను, విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంబించాలని, మధ్యాహ్న భోజన వర్కర్స్‌కు హెల్త్ చెకప్ చేయించాలని సూచించారు.

**ఇంగ్లీష్ మీడియంలోనే బోధన..**

ఉపాధ్యాయులు బోధనా పద్ధతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ స్నేహ శబరిష్ పేర్కొన్నారు. విద్యార్థులను బాహ్య ప్రపంచ పోటీకి తట్టుకునేలా తయారు చేయాలనే దృఢ నిశ్చయంతో, వారు ఇంగ్లీష్‌పై పట్టు సాధించేలా ఇంగ్లీష్ మీడియంలోనే బోధించాలన్నారు. పాఠశాలల్లో ఇంగ్లీష్ మాట్లాడే అలవాటును నేర్పించాలని, ప్రతి అంశంలో అవగాహన కల్పించాలని చెప్పారు. ఉపాధ్యాయులంతా సిలబస్‌పై పూర్తిగా సన్నద్ధమై రావాలని, విద్యార్థులకు సబ్జెక్టులోని అంశాలు గుర్తుండేలా పట్టు సాధింపజేయాలన్నారు. ఇంగ్లీష్ భాషపై మాట్లాడటం, రాయడం నేర్పించి విద్యార్థులను మెరుగ్గా తీర్చిదిద్దాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ మూర్తి, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, వివిధ మండలాల మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుగా స్పెషల్ అవార్డు సాధించిన పి. హర్షిత

తెలంగాణ మోడల్ యునైటెడ్ నేషన్స్ (టి ఎన్ యు ఎన్)లో ప్రతిభ
బండారుపల్లి పాఠశాల విద్యార్థినిని అభినందించిన విద్యాశాఖ డైరెక్టర్
ప్రిన్సిపాల్ పి. దేవకి హర్షం

అక్షరదర్బార్, ములుగు: హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ టి జి ఐ ఆర్ డి లో నిర్వహించిన తెలంగాణ మోడల్ యునైటెడ్ నేషన్స్ (టి ఎన్ యు ఎన్) కార్యక్రమంలో ములుగు జిల్లా టీజీఎంఎస్ బండారుపల్లి పాఠశాల విద్యార్థిని పి. హర్షిత అద్భుత ప్రతిభ కనబరిచింది. ఇంటర్నేషనల్ ప్రెస్ విభాగంలో జర్నలిస్టుగా హర్షిత 'స్పెషల్ అవార్డు' సాధించి తమ పాఠశాలకు ఘనమైన గౌరవాన్ని తీసుకువచ్చిందని పాఠశాల ప్రిన్సిపాల్ పి. దేవకి ఒక ప్రకటనలో ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, హర్షిత తన అసాధారణ జర్నలిస్టిక్ నైపుణ్యాలను ప్రదర్శించి ఈ విశిష్ట విజయాన్ని సాధించిందని కొనియాడారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు సదానందం, ఆయాజ్ ఖాన్ లు హర్షితకు తగిన మార్గదర్శకత్వం, ప్రోత్సాహాన్ని అందించారని తెలిపారు. హర్షిత కనబరిచిన అత్యుత్తమ ప్రతిభను గుర్తించి, తెలంగాణ పాఠశాల విద్యాశాఖ గౌరవ డైరెక్టర్ ఆమెను ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాన్ని అందజేశారని పేర్కొన్నారు. పాఠశాల ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలో చాటిన విద్యార్థినిని ఉపాధ్యాయ బృందం, తోటి విద్యార్థులు, గ్రామ పెద్దలు అభినందించారు.



# గ్రామ గ్రామాన పంట మార్పిడి.. కూరగాయల సాగుపై అవగాహన

- ప్రతి గ్రామంలో 50 ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు
- శాశ్వత పందిరి నిర్మాణానికి ఎకరానికి లక్ష రూపాయల రాయితీ
- కురవి వీరభద్ర రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సభ్యుల సర్వసభ్య సమావేశం



మహబూబాబాద్, జూన్ 24 (అక్షరదర్బార్):ఎల్నినో మరియు మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు సాంప్రదాయ పంటల నుండి లాభసాటి ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న పిలుపునిచ్చారు. బుధవారం గౌరవ కలెక్టర్ & జిల్లా మెజిస్ట్రేట్ శ్రీమతి స్నేహ శబరీష్, I.A.S. గారి ఆదేశాల ప్రకారం గాయత్రి మండల సమాఖ్య కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి, కురవి వీరభద్ర మహిళా రైతు ఉత్పత్తి దారుల కంపెనీ లిమిటెడ్ సభ్యులకు కూరగాయల సాగుపై విస్తృత అవగాహన కల్పించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రతి గ్రామంలో 50 ఎకరాలలో పంట మార్పిడి చేపట్టేలా గ్రామ గ్రామాన ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆయిల్ పామ్, మల్బరీ, పండ్లు, పూలు, మునగ, తేనెటీగల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం చేపట్టడం ద్వారా ఎకరానికి లక్ష రూపాయల నికర ఆదాయం పొందవచ్చని వివరించారు. టమాటా, వంగ, పచ్చిమిరప, దోస, బీర, సొర, గోరుచిక్కుడు, బెండ, ఆకుకూరలతో పాటు జామ, నిమ్మ, అరటి, బొప్పాయి, సీతాఫలం, పనస, నేరేడు, అవకాడో, ఫ్యాషన్ ఫ్రూట్, వెదురు మొదలైన తోటల సాగు వైపు మరలాలన్నారు. కూరగాయల సాగులో షేడ్ నెట్లు, ట్రెల్లిస్, ఎగబాకించే పద్ధతి, పందిరి సాగు వంటి ఆధునిక పద్ధతులు పాటించాలని సూచించారు.

**ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి..**

కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు రాయితీలు అందిస్తోందని, అంతర పంటల సాగుకు ఎకరానికి రూ.2,100/-, శాశ్వత పందిరి నిర్మాణానికి ఎకరానికి లక్ష రూపాయల రాయితీ, అలాగే ఎకరానికి రూ.10,000/- విలువైన కూరగాయల నారు మొక్కల సరఫరా మరియు చిరు సంచుల పంపిణీ వంటి సౌకర్యాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి రైతు పొలం గట్ల మీద, పెరట్లో, ఆయిల్ పామ్ మరియు పండ్ల తోటలలో అంతర పంటలుగా రోజువారీ కూరగాయలను సాగు చేసుకోవచ్చన్నారు. సాగులో ప్రోట్రేలో నారు పెంపకం, ఎత్తు మడులు, మల్చింగ్, బిందు సేద్యం, ఫర్టిగేషన్, వేప పిండి, ఆముదం పిండి, వేప నూనె పిచికారి, పసుపు రంగు అట్టల వాడకం వంటి మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి. నరసింహా రావు, సహాయ ప్రాజెక్ట్ మేనేజర్ కె. దుర్గా రావు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి యం. వీర ప్రసాద్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కె. స్వరూప, ఛైర్మన్ బి. పద్మ, వైస్ ఛైర్మన్ సుమిత్ర, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ అధికారి బి. నాగరాజు, కార్యాలయ సిబ్బంది శోభ, జననీ మరియు సంబంధిత కమ్యూనిటి కోఆర్డినేటర్లు, రైతులు పాల్గొన్నారు.

## కేయూ బయోటెక్నాలజీ విభాగ పాఠ్య ప్రణాళిక అధ్యక్షుడిగా డా. టి. శాస్త్రి

- రెండేళ్ల కాలానికి నియమిస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు
- వీసీ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందజేత
- శుభాకాంక్షలు తెలిపిన అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు

అక్షర దర్బార్, హనుమకొండ : కాకతీయ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగ పాఠ్య ప్రణాళిక (బోర్డ్ ఆఫ్ స్టడీస్) అధ్యక్షుడిగా విభాగ సహాయ ఆచార్యులు డా. టి. శాస్త్రి నియమితులయ్యారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు డా. శాస్త్రిని రెండేళ్ల కాలానికి నియమిస్తూ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. డా. టి. శాస్త్రి ఈ నియామక ఉత్తర్వులను వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. త్వరలోనే ఆయన ప్రస్తుత పాఠ్య ప్రణాళిక అధ్యక్షుడు డా. పి. శ్రీనివాస్ నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా బయోటెక్నాలజీ విభాగ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు డా. టి. శాస్త్రికి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. విభాగ అభివృద్ధి, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఆయన సేవలు ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.